TGTEL/26/A0372

మన మహతి న్యూస్

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ :డాక్టర్. ప్రకాష్ జాదవ్ | బుధవారం జూన్ 03, 2026 | సంపుటి : 01 సంచిక : 125 | పేజీలు 5 వెల-2/- MANAMAHATINEWS.COM

# తెలంగాణ కోటి రత్నాలవీణ

## త్వరలోనే జాబ్ నోటిఫికేషన్లు విడుదల









- » టీజీపీఎస్సీ ద్వారా విడుదల చేస్తాం
- » జాబ్ నోటిఫికేషన్ల జారీ నిరంతర ప్రక్రియ
- » న్యాయపరమైన సమస్యలు లేకుండా భర్తీ
- » 67 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశాం
- » నిరుపేదల సొంతింటి కల సాకారం చేస్తాం
- » అద్దె ఇళ్ల బాధల నుంచి విముక్తి చేస్తాం
- » సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం
- » విజన్-2047 లక్ష్యం దిశగా ముందుకు..
- » కాళోజీ స్ఫూర్తితో అధికారం చేపట్టాం
- » నాటి నుంచి రాష్ట్ర హితంకై శ్రమిస్తున్నాం
- » రాచరికం, పెత్తనాన్ని సమాజం సహించదు
- » నలుగురి చేతిలో ఉండే పెత్తనం కాదు
- » ప్రజాకాంక్షలు నెరవేర్చే ప్రజా ప్రభుత్వం
- » రుణమాఫీతో రైతులను రుణ విముక్తి చేశాం
- » తొలి ఏడాదిలోనే రూ.22 వేల కోట్లు జమ
- » తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి కృషి
- » సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం చిత్తశుద్ధి
- » కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేస్తాం
- » మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దుతాం
- » మహిళా సంఘాలకు సున్నా వడ్డీ రుణాలు
- » రాష్ట్ర మహిళ దేశ పారిశ్రామికరంగంలో కీలకం
- » తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి వెల్లడి
- » ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ విషెస్
- » ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- » సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహణ
- » అమరవీరుల స్థూపానికి నివాళి అర్పించిన సీఎం

**హైదరాబాద్, జూన్ 2 :**
తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా నిరుద్యోగ యువతకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. త్వరలోనే పలు జాబ్ నోటిషికేషన్లను టీజీపీఎస్సీ విడుదల చేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమానికి, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఇక్కడ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో వైభవంగా నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీఎం... రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం ఎప్పటికీ సహించదన్నారు. ప్రత్యేక తెలంగాణ కల సాకారం చేసిన నాటి ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీలకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ వేడుకలలో భాగంగా విధుల్లో ఉత్తమ సేవలు అందించిన పలువురు పోలీసు అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విశిష్టసేవా పురస్కారాలను ప్రదానం చేశారు. "పుట్టుక నీది, చావు నీది.. బతుకంతా దేశానిది" అన్న ప్రజాకవి కాళోజీ నారాయణరావు మాటలను సీఎం రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. కాళోజీ స్ఫూర్తితోనే తాము అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర ప్రజల హితం కోసం నిరంతరం శ్రమిస్తున్నామని, తమది ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రభుత్వం అన్నారు. గత 30 నెలల తమ పాలనలో ప్రజా సంకల్పాన్ని నిజం చేయడంలో విజయవంతం అయినట్లు పేర్కొన్నారు. తెలంగాణ విజన్-2047 లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని.. రాబోయే రోజుల్లో రాష్ట్ర రైతులను వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని ఈ వేదికగా హామీ ఇచ్చారు.

మిగతాద్ది 2 లో





# రాష్ట్రంలో కాంగ్రెస్‌కు తిరుగు లేదు

- తమతో పోటీకి దిగే ప్రత్యర్థులే లేరు
- రాష్ట్ర అభివృద్ధికి కేబినేట్ జట్టుగా పనిచేస్తోంది
- తామంతా నూరుశాతం చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం
- ధాన్యం సేకరణ వైఫల్యం మమ్మాటికీ బిజెపిదే
- మీడియతో డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క



**ఖమ్మం,జూన్2 :**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై మీడియా దృష్టి పెట్టాలని.. ఓట్లు గల్లంతు కాకుండా చూసుకోవాలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రతి ఒక్కరూ సర్ మ్యాపింగ్‌పై దృష్టి పెట్టాలన్నారు. తెలంగాణ అవతరణ వేడుకల అనంతరం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యర్థులే లేరని వ్యాఖ్యానించారు. 'రైతు వ్యతిరేక పార్టీ భాజపానే. పని చేసే పార్టీలకు ప్రచారం అవసరం లేదు. అసెంబ్లీ, ఎంపీ, మున్సిపల్ ఎన్నికల్లో మా సత్తా చూపించాం. జిల్లా పరిషత్ ఎన్నికలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని భట్టి విక్రమార్క తెలిపారు. ఇకపోతే తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి ఇళ్ల స్థలాలు, ఇళు కేటాయించే అంశంపై ప్రభుత్వం చాలా బలంగా ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రస్తుత తెలంగాణ మంత్రివర్గం రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒక టీమ్‌లా అద్భుతంగా పనిచేస్తోందని డిప్యూటీ సీఎం కొనియాడారు. అందరి లక్ష్యం తెలంగాణ అభివృద్ధి మాత్రమేనని, క్షేత్రస్థాయిలో పనిచేసే పార్టీలకు ఎలాంటి ఆర్భాటపు ప్రచారాలు అవసరం లేదని, ప్రజలకు సేవ చేయడమే తమ మొదటి ప్రాధాన్యతని స్పష్టం చేశారు. అసెంబ్లీ, లోక్‌సభ , మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తన సత్తా చాటుకుందని గుర్తు చేస్తూ.. ప్రస్తుత ప్రభుత్వ పాలనకు తాను వంద శాతం మార్కులు వేస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఇదే ఊపుతో రాబోయే జిల్లా పరిషత్ ఎన్నికలపై కూడా ప్రభుత్వం త్వరలోనే సరైన నిర్ణయం తీసుకుంటుందని, 2028 లో జరిగే తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ప్రత్యర్థులే ఎవరూ లేరని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు, రాజకీయ పరిణామాలు , ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. జర్నలిస్టుల ఇళ్ల సమస్య పరిష్కారం కోసం ప్రత్యేకంగా అధికారులు పనిచేస్తున్నారని, దీనిపై ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో 'రాజీవ్ ఆరోగ్యశ్రీ' పథకం అత్యంత అద్భుతంగా నడుస్తోందని, ప్రజలందరూ ఈ ఉచిత వైద్య సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

మిగతాద్ది 2 లో




తెలంగాణ సంస్కృతిని

# ముందుకు తీసుకెళతాం

- » అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది
- » ఢిల్లీలో తెలంగాణ అవరతణ వేడుకల్లో నితిన్ నబీ

**న్యూఢిల్లీ,జూన్2 :**
తెలంగాణ అభివృద్ధి, సంస్కృతిని ముందుకు తీసుకువెళ్లాలన్నది బీజేపీ సంకల్పం' అని బిజెపి జాతాయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది. పీఎం కిసాన్ యోజన ,ముద్ర లోన్లు, జన్ ధన్ ఖాతాలు అందించాం.

మిగతాది 2లో





# సంక్షేమం నుంచి సంక్షోభంలోకి తెలంగాణ

- పుష్కర తెలంగాణ కాస్తా ముష్కర తెలంగాణ
- తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ నేత కెటిఆర్

**హైదరాబాద్,జూన్2 :**
తెలంగాణ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, అమరవీరులకు నివాళు లర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, బీఆర్ఎస్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు తెలంగాణ కళాకారులకు కేటీఆర్ సన్మానం చేశారు.అనంతరం పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఒకప్పుడు అభివృద్ధి, సంక్షేమానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ ప్రస్తుతం సంక్షోభంలోకి నెట్టబడిందని అన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో నింపేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నో పాటలు రాశారని కేటీఆర్ గుర్తు చేశారు.

మిగతాది 2లో

# జనసేన పుట్టిందే తెలంగాణలో

- అందుకే ఇక్కడి ఎన్నికల్లో పోటీ చేస్తుంది
- ఇంకెంత కాలం ఆంధ్రావాళ్లను తిడతారు
- తెలంగాణ గడ్డపై నుంచే పోరాటం పుణికి పుచ్చుకున్నా
- తెలంగాణ అంటే గౌరవంతోనే కొండగట్టుకు కోట్ల విరాళం
- తెలంగాణను వ్యతిరేకించిన వారే ఎమ్మెల్యేలుగా ఉన్నారు
- తెలంగాణకు ద్రోహం జరిగితే గొంతు లేపేది జనసేనే
- తెలంగాణపై తనకున్న ప్రేమ రాజకీయాలకు అతీతం
- ఎవరి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు
- మీడియా సమావేశంలో జనసేనాని పవన్ కల్యాణ్ స్పష్టీకరణ




**హైదరాబాద్,జూన్2 :**
తెలంగాణలో జనసేన పార్టీ ఉంటుందని ఆ పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు. తెలంగాణలో పోటీ చేస్తామని ఆయన కుండ బద్దలు కొట్టారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో పవన్ కల్యాణ్ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. దేశంలో అంతర్భాగం తెలంగాణ అని స్పష్టం చేశారు.




నాలుగు కోట్ల ప్రజల

# జాగీరు తెలంగాణ

- నీ అయ్య జాగీర్ కాదు మిస్టర్ పవన్
- తెలంగాణపై అక్కసు వెళ్లగక్కడమే తెలుసు
- పవన్ మీడియా వ్యాఖ్యలపై మండిపడ్డ పొన్నం

**హైదరాబాద్,జూన్2 :**
ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల జాగీరు.. నీ అయ్యా జాగీరు కాదంటూ జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్‌లో జనసేనాని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ గాంధీభవన్ వేదికగా స్పందించారు. మిస్టర్ పవన్ కల్యాణ్.. ఇది మా అయ్య జాగీరే అని మంత్రి పొన్నం స్పష్టం చేశారు.




- తెలంగాణ నిరుద్యోగులకు శుభవార్త
- ఆర్ అండ్ బిలో 222 ఖాళీ ఇంజనీర్ల భర్తీ
- నోటిఫికేషన్ ఇచ్చిన టిజి పబ్లిక్ సర్వీస్ కమిషన్

**హైదరాబాద్:**
తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మరో కీలక నోటిఫికేషన్ విడుదల చేసింది. ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యార్హత కలిగిన అభ్యర్థులకు ఇది మంచి అవకాశంగా మారనుంది. రోడ్లు, భవనాల శాఖలో మొత్తం 222 ఖాళీల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# తెలంగాణ కోటి రత్నాలవీణ

మొదటిపేజీ తరువాయి

ఎలాంటి న్యాయపరమైన సమస్యలు లేకుండా, అత్యంత పారదర్శకంగా ఇప్పటివరకు 67 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. ఈ సందర్భంగా నిరుద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త అందించారు. ఈ నెలలోనే టీజీపీఎస్సీ ద్వారా ఇంజినీరింగ్, పీసీబీ, అటవీశాఖ, టౌన్‌ప్లానింగ్, విద్యాశాఖల్లో ఖాళీలకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తామని ప్రకటించారు. ఉద్యోగాల నోటిఫికేషన్ల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, విద్యా రంగంలో భాగంగా ఇప్పటికే 1,362 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ క్లాసులు ప్రారంభించామన్నారు. ఈ ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని, త్వరలోనే జూనియర్ కాలేజీల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అద్దె ఇళ్ల బాధలు, కష్టాల నుండి పేదలకు విముక్తి కలిగించేందుకు గత 13 నెలల కాలంలో 1.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించగా, ఇందుకోసం రూ.22 వేల కోట్లు ఖర్చు చేశామని ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 3.50 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, ఈసారి క్యూఆర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని చెప్పారు. కొత్త రేషన్‌కార్డులను కూడా పంపిణీ చేసి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ఈ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని సీఎం వెల్లడించారు. ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం సహించదన్న రేవంత్, ప్రభుత్వం అంటే నలుగురి చేతిలో ఉండే పెత్తనం కాదని స్పష్టం చేశారు. తమది ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే ప్రజా ప్రభుత్వమన్న సీఎం, గత 30 నెలల్లో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో విజయవంతం అయ్యామన్నారు. తెలంగాణ విజన్-2047 లక్ష్యం సాధించే దిశగా వెళ్తున్నామని స్పష్టం చేశారు. రైతులను వ్యవసాయ పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం తెలిపారు. జలయజ్ఞంలో చేపట్టిన ప్రాజెక్టులు పదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి మళ్లీ కృషి చేస్తున్నామని చెప్పారు. రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిందని సీఎం ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఒకేసారి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి రైతులను రుణ విముక్తి చేశామని సీఎం తెలిపారు. తొలి ఏడాదిలోనే రైతుల ఖాతాల్లో రూ.22 వేల కోట్లు జమ చేసినట్లు చెప్పారు. రైతుల పంటలు చివరి గింజ వరకు కొనేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బు రూ.11,300 కోట్లు జమ చేశామని తెలిపారు.మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు ప్రణాళికలు వేస్తున్నట్లు రేవంత్? రెడ్డి తెలిపారు. మహిళా సంఘాలకు రూ.60 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు ఇచ్చామని చెప్పారు. తెలంగాణ మహిళ దేశ పారిశ్రామికరంగంలో కీలకంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలు రూ.10 వేల కోట్లు ఆదా చేసుకున్నారన్న ముఖ్యమంత్రి, 53.90 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని గుర్తుచేశారు. రెండున్నరేళ్లలో ప్రజల ఆశలు, ఆశయాలను నెరవేర్చడంలో విజయం సాధించాం. రాష్ట్రంలో రైతుల్ని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నాం. గత ప్రభుత్వం లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిపోయింది. మరమ్మతులు చేయించే భారం ప్రభుత్వంపై పడింది. ఉద్యోగాల భర్తీ ప్రక్రియను విజయవంతంగా చేపట్టాం. రికార్డు సమయంలో 67,763 పోస్టులను భర్తీ చేశాం. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ద్వారా విద్యా వ్యవస్థ మరి బలోపేతం కానుంది. పేదలను అద్దె బాధలనుంచి విముక్తి చేయాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు.

కాగా.. తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. సీఎం రేవంత్ రెడ్డి ముందుగా అసెంబ్లీ సమీపంలోని గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాల్లో సంబంధిత మంత్రులు జాతీయ జెండా ఆవిష్కరించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాత్రి వేళల్లో హైదరాబాద్‌లోని సచివాలయం, అసెంబ్లీ భవనాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తొలి విడతలో 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, రూ.22 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. 53.90 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని గుర్తుచేశారు. హనుమకొండలో అమరవీరుల స్థూపానికి రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వద్ద నివాళి అర్పించి జెండాను ఆవిష్కరించారు. నల్గొండ క్లాక్ టవర్ కూడలి వద్ద అమరవీరుల స్థూపానికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నివాళి అర్పించారు. తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి విగ్రహానికి పుష్పాలతో నివాళి అర్పించారు. అనంతరం పోలీసు పరేడ్ మైదానంలో జాతీయపతాకావిష్కరణ చేశారు. నల్గొండలోని కలెక్టరేట్?లో ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. అమరవీరుల త్యాగ ఫలితమే మన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమని తెలిపారు. తెలంగాణ చరిత్ర గురించి మాట్లాడాలంటే నల్గొండ ప్రస్తావన లేకుండా ఒక్క పేజీ కూడా ముందుకు సాగదన్నారు. నల్గొండ కేవలం జిల్లా కాదని విప్లవాల పురిటి గడ్డ, అన్యాయంపై తిరగబడ్డ వీరుల అడ్డా అని వెంకట్?రెడ్డి చెప్పారు. నా భూమి జోలికొస్తే ఆ భూమిలోనే నీ గోరి కడతాం అని దొరల గుండెల్లో వణుకు పుట్టించిందన్నారు. నల్గొండ గడ్డ మన పిల్లలు లాఠీ దెబ్బలు తింటే, శ్రీకాంతాచారి తన ప్రాణాన్ని త్యాగం చేస్తుంటే చూస్తూ ఊరుకోలేదని అన్నారు. తానేప్పుడూ పదవుల కోసం ఆశపడలేదని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్ష నెరవేరకపోతే ఈ పదవులు ఎందుకని నాడు మంత్రి పదవిని విసిరికొట్టి ఉద్యమంలోకి దిగిన చరిత్ర తనదన్నారు.

# జనసేన పుట్టిందే తెలంగాణలో

మొదటిపేజీ తరువాయి

తెలంగాణను వ్యతిరేకించిన వారే.. పదవుల్లో ఉన్నారని.. ఎమ్మెల్యేలు అయ్యారని పవన్ కల్యాణ్ వివరించారు. తెలంగాణ అంటే గౌరవం ఉంది కనుకే కొండగట్టు ఆలయానికి కోట్ల రూపాయిలు విరాళంగా ఇచ్చామన్నారు. మీ తాటాకు చప్పుళ్లకు జనసేన పార్టీ భయపడదన్నారు. భయపడేవాడినే అయితే పార్టీ పెడతానా? అని ప్రశ్నించారు. తెలంగాణకు ద్రోహం జరిగితే మొట్టమొదట గొంతులేపేది జనసేన పార్టీనే అని స్పష్టం చేశారు. ఏం చేసినా ఓట్ల కోసం కాదు.. తనకు తెలంగాణపై ప్రేమ, మమకారం ఉన్నాయన్నారు. గుంటూరులో టీఆర్ఎస్ కార్యాలయం పెడితే స్వాగతించామని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు.. ఇక్కడ ఏమైనా చేస్తే తాను సీఎం అయిపోతానా? అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. తెలంగాణను తానెప్పుడు అవమానించానని ఆయన స్థానిక నేతలను ప్రశ్నించారు. తన పీక కోసినా కూడా భయపడేది లేదన్నారు. తనకు రెచ్చగొట్టడం ఇష్టం లేదని తెలిపారు. తనను ఎన్ని తిట్టినా పట్టించుకోనన్నారు. తెలంగాణలో ఉపాధి లేకపోతే తాను కారణమా? అని రాజకీయ పార్టీల నాయకులను ఆయన సూటిగా నిలదీశారు. మద్రాస్‌లో ఉన్న చిత్రపరిశ్రమ ఇక్కడికి ఎలా వచ్చిందన్నారు. ఆంధ్రా వాళ్లను తిడుతుంటే వాళ్లు ఇక్కడెలా ఉంటారన్నారు. ఇంకెంతకాలం ఆంధ్రావాళ్లను తిడుతూ కాలక్షేపం చేస్తారంటూ తెలంగాణలోని నాయకులకు ఆయన సూటిగా ప్రశ్నించారు. సడెన్‌గా ఇక్కడికి రావొద్దంటే ఎలా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో ఏపీ కాంట్రాక్టర్లు బాగానే ఉన్నారన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తనకు గౌరవం ఉందన్నారు. తాను చెరువును కబ్జా చేశానని కొందరు అంటున్నారని.. అలా చేస్తే తనను ఇక్కడ ఉండనిస్తారా? అని ఆయన సూటిగా నిలదీశారు. తన ఫామ్‌హౌస్ కబ్జా అని తేలిస్తే.. దానిని రాష్ట్ర ప్రభుత్వానికే రాసిస్తానన్నారు. గద్దర్‌తో తనకు చాలా సాన్నిహిత్యం ఉందని గుర్తు చేసుకున్నారు. రాజకీయాల్లోకి రాకముందే తనకు గద్దర్ తెలుసునన్నారు. గద్దర్ ఒంట్లో బుల్లెట్లు దిగినప్పుడు ఎందుకు మాట్లాడలేదని రాజకీయ పార్టీల నేతలను పవన్ కల్యాణ్ సూటిగా ప్రశ్నించారు. గద్దర్ తమ పార్టీ కార్యాలయానికి వచ్చేవారని గుర్తు చేశారు. గద్దర్ బతికున్నప్పుడు మీరంతా ఎక్కడున్నారు? అంటూ తనను ప్రశ్నిస్తున్న నేతలకు పవన్ కల్యాణ్ చురకలంటించారు.తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఉత్తేజం పొందామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తెలంగాణపై తనకున్న ప్రేమ రాజకీయాలకు అతీతమైనదన్నారు. తెలంగాణపై తనకు కొత్తగా వచ్చిన ప్రేమ కాదని పేర్కొన్నారు. 13వ ఏట అడుగుపెడుతున్న తెలంగాణకు శుభాకాంక్షలు తెలిపారు. లక్ష మందికిపైగా జనసేన నాయకులు, సైనికులు ఉన్న.. తెలంగాణలో కేడర్ తరఫున ప్రజలకు శుభాకాంక్షలు చెప్పారు. తెలంగాణలో జనసేన పార్టీ పుట్టిందని గుర్తు చేశారు. ఇక్కడి నాయకులంతా 2007-08 నుంచి.. అప్పటి యువరాజ్యంలో సభ్యులని వివరించారు. తెలంగాణ నలుమూలలా పెరిగిన వాడిని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తెలంగాణ బాగుండాలనే ఎప్పుడూ కోరుకున్నానని తెలిపారు. తన సినిమాల్లో తెలంగాణ స్ఫూర్తి కనిపిస్తుందని చెప్పారు. ఆదిలాబాద్ తాండాల్లో గడిపిన వాడిని.. ఆ తాండాల్లో దాహార్తి తీర్చిన వాడినని ఏపీ డిప్యూటీ సీఎం వివరించారు. తెలంగాణ విభజన తీరుకు తాము వ్యతిరేకమన్నారు. పార్లమెంట్ తలుపులు మూసి రాష్ట్ర విభజించిన తీరును ప్రశ్నించామని చెప్పారు. తనకు వారాహి యాత్రకు అనుమతి ఇచ్చింది తెలంగాణ అని వ్యాఖ్యానించారు. వైసీపీ తనను ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టనివ్వనంటే ఈ ప్రాంతం ఆదరించిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోనే తాను అధికారం కోరుకోలే దన్నారు. అలాంటిది తెలంగాణలో ఎందుకు కోరుకుంటానని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు, నాయకులకు ఆంధ్రప్రదేశ్‌పై విద్వేషం లేదన్నారు. విద్వేషం చూపించి ఉంటే ఆ రాష్ట్ర ప్రజలు ఇక్కడ తిరిగేవారు కాదని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో తనకేం పని కొందరు ప్రశ్నిస్తున్నారన్నారు. మీరు ఎవరు తనను బెదిరించడానికి అని ప్రశ్నించారు. తెలంగాణ మీ అయ్య జాగీరా అని వారిని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ నిలదీశారు. తనపై దాడులు చేస్తామంటున్నారన్నారు. తనకు తెలంగాణలో కంటే ఏపీలోనే బెదిరింపులు అధికంగా ఉన్నాయని చెప్పారు. 2019 తాను ఓడిపోయినప్పుడు.. తెలంగాణ వాసులే.. ఇక్కడ ఆ పరిస్థితి రాదన్నారని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ గుర్తు చేసుకున్నారు. తెలంగాణలో జనసేన ఎదగాలని ఎంతగానో ఎదురుచూస్తున్నారని తెలిపారు. మీరు ఎన్ని తిట్లు తిట్టినా.. తన గుండెలో తెలంగాణ ఉంటుందని స్పష్టం చేశారు. వైసీపీ గూండాల బెదిరింపుల ముందు ఈ బెదిరింపులు ఓ లెక్కా? అని అన్నారు. ఓ విశ్లేషకుడు ఇక్కడ తన గురించి తప్పుగా మాట్లాడారని తెలిపారు. ఆ విశ్లేషకుడి వల్లే ఈ గొడవ మొదలైందన్నారు. ఆ వ్యాఖ్యలపైనే జనసేన సైనికులు స్పందించారని వివరించారు. కొన్ని చోట్ల కేసులు పెట్టారు.. అందులో తన ప్రమేయం లేదని స్పష్టం చేశారు. పార్టీ స్థాపించి 13 ఏళ్లు గడుస్తున్నా ఇంకా మేం నోరు మూసుకుని కూర్చోవాలా? అంటూ అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణలో మార్పు తప్ప మేం అధికారం కోరుకోవడం లేదని పేర్కొన్నారు. దేశంలో చాలా చోట్ల తెలుగువారు ఉన్నారని గుర్తు చేశారు. వాళ్లను అక్కడి నుంచి వెళ్లిపోమనడం కరెక్టేనా? అని ప్రశ్నించారు. ఇదిలావుంటే జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జూబ్లీహిల్స్ నివాసం వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఆయన నివాసం వద్దకు భారీగా అభిమానులు, జనసేన కార్యకర్తలు చేరుకున్నారు. పవన్ ఇంటి వరకు వారిని పోలీసులు అనుమతించకపోవడం, అలాగే, జనసేన తలపెట్టిన జన సంకల్ప సభకు అనుమతి నిరాకరించడంపై కార్యకర్తలు ఆందోళనకు దిగారు. పవన్ ఇంటివైపు వెళ్తున్న జనసేన శ్రేణులు, అభిమానులను పోలీసులు అడ్డుకుంటున్నారు. ప్రభుత్వం, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పవన్ నివాసం సమీపంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తెలంగాణ ప్రజలకు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జనసేన ఊపిరిలూదుకొన్నది తెలంగాణ గడ్డపైనేనని పేర్కొన్నారు. ఈ నేల నుంచే వారసత్వంగా పోరాట పటిమను పుణికి పుచ్చుకున్నదని చెప్పారు. తెలంగాణ సమున్నతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అణగారిన వర్గాల సంక్షేమం, యువత ఆకాంక్షలు, వ్యక్తి స్వేచ్ఛకు విఘాతం కలిగితే గళం వినిపించే తెగువ తెలంగాణలో ఉంది. ఆ లక్షణం జనసేన శ్రేణుల్లోనూ నిండుగా ఉంది. ఘనమైన చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపద విలసిల్లే తెలంగాణ రాష్ట్రం సమున్నతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నాను. తెలంగాణ కోసం బలిదానం చేసిన ప్రతి ఒక్కరికీ అంజలి ఘటిస్తున్నానని అన్నారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్‌కు తిరుగు లేదు

మొదటిపేజీ తరువాయి

ఈ పథకం సజావుగా సాగడం కోసం ప్రభుత్వం ప్రతి నెలా 150 కోట్ల నిధులను కేటాయిస్తోందని వెల్లడించారు. ఈ పథకం ద్వారా పేదలకు 10 లక్షల వరకు వైద్య బీమా కవరేజ్ లభిస్తుందని, ప్రభుత్వంలో పూర్తి బాధ్యతాయుతమైన విధివిధానాలు ఉన్నాయని చెప్పారు. వైద్య సేవలను మరింత బలోపేతం చేయడానికి వీలుగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులలో కొత్తగా 10 వేల బెడ్‌లను పెంచుతున్నట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్రంలో రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ కరెంట్ మీటర్లు పెట్టబోమని, ఉచిత కరెంట్ అందించి తీరుతామని ముఖ్యమంత్రి చేసిన ప్రకటనపై ప్రతిపక్షాలు నోరు మెదపకపోవడమే భవిష్యత్తులో తమ విజయానికి నిదర్శనమని భట్టి విక్రమార్క అన్నారు. అలాగే, సమాజంలో ఓట్ల గల్లంతు వ్యవహారంపై మీడియా ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఓటర్ల మ్యాపింగ్ , అన్-మ్యాపింగ్ ప్రక్రియలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్న 'ఇందిరమ్మ జీవిత బీమా పథకం' రాష్ట్రంలోని లబ్దిదారులందరికీ ఎంతో ప్రయోజనకరంగా మారుతుందని భరోసా ఇచ్చారు. ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ నాయకులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లపై భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పూర్తిగా రైతు వ్యతిరేక ప్రభుత్వమని ధ్వజమెత్తారు. దేశంలో మొదటి నుండి గోదాములలో స్టాక్ ఉంచడం నేరమైనప్పటికీ, బీజేపీ ప్రభుత్వం మాత్రం అదానీ, అంబానీ లాంటి పెద్ద కార్పొరేట్ సంస్థలకు గోదాములు పెట్టుకునేలా లబ్ది చేకూర్చిందని ఆరోపించారు. తెలంగాణ బీజేపీ నేతలు ఇక్కడ రాజకీయాలు మాట్లాడటం మానేసి.. కేంద్రం ద్వారా ముందుగా ధాన్యం కొనుగోళ్లు జరిగేలా చూడాలని, ఆ తర్వాతే ఇతర విషయాల గురించి మాట్లాడాలని డిప్యూటీ సీఎం గట్టిగా హితవు పలికారు.

# నాలుగు కోట్ల ప్రజల జాగీరు తెలంగాణ

మొదటిపేజీ తరువాయి

పవన్ కల్యాణ్ ఇక్కడికి వచ్చి పీకేదేంటని ఆయన ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ పెయిడ్ ఆర్టిస్ట్ అని అభివర్ణించారు. తన దగ్గర డబ్బులు ఉంటే తాను కూడా పవన్‌తో ఒక క్యారెక్టర్ చేయిస్తానన్నారు. తెలంగాణపై పవన్ కల్యాణ్ మరోసారి అక్కసు వెళ్లగక్కారంటూ మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వ్యక్తి పవన్ అని తెలిపారు. గద్దర్‌కు కారు కొనిచ్చా అని చెప్పినందుకు ముందు క్షమాపణ చెప్పాలంటూ పవన్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. చనిపోయిన వారి గురించి మాట్లాడాల్సిన అవసరం ఏంటని ఏపీ డిప్యూటీ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. తనకి ఆంధ్రాలోనే దిక్కు లేదని పవన్ చెప్పుకున్నాడని వ్యంగ్యంగా అన్నారు. ఉద్యమ సమయంలో కూడా ఆంధ్రా వాళ్ళని మేం ఏం అనలేదని పేర్కొన్నారు. మేం ఆంధ్రా వాళ్ళని ఏదో అన్నట్టు పవన్ కల్యాణ్ అబద్దాలు చెబుతున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటులో ఏ బిల్లు చేసినా తలుపులు మూసే పాస్ చేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పుకొచ్చారు. కొండగట్టుకు ఇచ్చిన పైసలు మీ అయ్యా జాగీరా? అని సందేహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు మీటింగ్ పెట్టడం గెలకడం కాదా? అంటూ అసహనం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ తిరిగితే జనాలు వస్తారు కానీ ఓట్లు వేయరని ఎద్దేవా చేశారు. పవన్ కల్యాణ్ వచ్చినా, పోయినా మాకేం సంబంధం లేదన్నారు. తెలంగాణ ఎప్పుడైనా ఏపీ ప్రజలను స్వాగతిస్తూనే ఉంటుందని చెప్పారు. సినిమా నటుడిగా పవన్ ఎక్కడ తిరిగినా తమకేం ఇబ్బంది లేదన్నారు. పవన్ చేసిన వ్యాఖ్యలకు టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు ద్వంద్వ వైఖరిని అద్దం పడుతున్నాయని విమర్శలు గుప్పించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌వేదికగా పోస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పవన్ కల్యాణ్‌ది 'జనసేన' పార్టీ అని.. తెలంగాణలో బీజేపీ 'భజన సేన' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తెలంగాణలో నిరుద్యోగంపై కొట్లాడుతానని అన్న పవన్ కల్యాణ్‌కి.. కేంద్ర ప్రభుత్వం కారణంగా పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, పేపర్ లీక్ ఘటనలు కనిపించడం లేదా? అని నిలదీశారు. ఒకవేళ కనిపించినా నిలబడి కొట్లాడటానికి కాళ్ళు లేవట్లేవా?? అంటూ ఘాటుగా స్పందించారు. పవన్ ద్వంద్వ వైఖరికి ఎందుకని ప్రశ్నించారు. 'ఇది తెలంగాణ జాతి.. అమ్మలా ఆదరించడం తెలుసు.. తెలంగాణలో కుట్రలు చేస్తే అమ్మోరులా దహించడమూ తెలుసు ... పోస్ట్ చేశారు.

# తెలంగాణ సంస్కృతిని ముందుకు తీసుకెళతాం

మొదటిపేజీ తరువాయి

మౌలిక వసతులు,రోడ్లు,రహదారులు,రైల్వేలైన్లు ఏర్పాటు చేస్తున్నాం. వికసిత భారత్ కావాలంటే వికసిత తెలంగాణ కావాలి. ఒక అవినీతి పరుడు చేతుల్లోంచి మరో అవినీతి పరుడి చేతుల్లోకి వెళ్ళింది. తెలంగాణ కలలను సాకారం చేస్తాం' అని నితిన్ నబీన్ పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అలానే కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఢిల్లీలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, టీజీ బీజేపీ చీఫ్ రామచందర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నితిన్ నబీన్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, ప్రజల పోరాట స్ఫూర్తిని కొనియాడుతూ, అభివృద్ధి పథంలో రాష్ట్రం మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. చిన్న రాష్ట్రాల అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ లాంటి రాష్ట్రాలు ఏర్పాటు చేశాం. తెలంగాణ అభివృద్ధి కోసం రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు ఇచ్చాం. తెలంగాణ అమరవీరులకు నివాళులర్పిస్తున్నా. అమరవీరుల కలలు కన్న రీతిలో ఇంకా రాష్ట్రం వెనుకబడి ఉంది. చిన్నమ్మ సుష్మా స్వరాజ్ తెలంగాణ ఏర్పాటుకు కృషి చేశారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వారు అధికారంలో ఉన్నారు. రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది. జార్ఖండ్ ఏర్పాటు సమయంలో జార్ఖండ్ ఏర్పాటు కానివ్వం అన్నవారే ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్నారు.

# సంక్షేమం నుంచి సంక్షోభంలోకి తెలంగాణ

మొదటిపేజీ తరువాయి

ఉద్యమ ప్రస్థానంలో కేసీఆర్ అనేక పాత్రలు పోషించారని, తెలంగాణ సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేశారని పేర్కొన్నారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో ముందుకు సాగి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని అన్నారు. కేసీఆర్ జీవిత గాథపై సినిమా తీయాలని ఒక దర్శకుడు తనను కలిసిన సందర్భాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఆలోచిద్దామని కేసీఆర్ చెప్పారని, తెలంగాణ ఆవిర్భావం అనేది అన్ని ప్రతికూల పరిస్థితులను ఛేదించి సాధించిన చారిత్రక విజయమని ఆ దర్శకుడు అభిప్రాయపడ్డారని తెలిపారు. కేసీఆర్ అనే మూడు అక్షరాల ముందు 'ముఖ్యమంత్రి' అనే పదవి చాలా చిన్నదిగా కనిపిస్తుందని ఆయన వ్యాఖ్యానించినట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసిన కేటీఆర్.. 'పుష్కర తెలంగాణ ఇప్పుడు ముష్కరుల తెలంగాణగా మారిపోయింది. నిష్ఫల తెలంగాణగా మారిపోయింది' అని విమర్శించారు. తెలంగాణ సాధన కోసం పదవిని మాత్రమే కాదు.. అవసరమైతే ప్రాణత్యాగానికీ సిద్ధపడ్డ నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యతో బాధపడిన ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించి వేలాది కుటుంబాల కష్టాలను తీర్చిన నాయకుడు కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొందరు ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారని ఆరోపించారు. రాజకీయ పరిస్థితులపై స్పందిస్తూ.. 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటరిగానే విజయం సాధించిందని, 2023 ఎన్నికల్లో కూడా ఒంటరిగానే పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అడ్డదారిలో అధికారంలోకి వచ్చిందని ఆరోపిస్తూ, ప్రస్తుతం రాష్ట్రాన్ని వెనక్కి నెట్టే విధంగా పాలన సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేస్తూ.. గ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక, పరిపాలనా వ్యవస్థలను దెబ్బతీస్తోందని ఆరోపించారు. 'వడ్డించిన విస్తరి లాంటి తెలంగాణను కుక్కలు చింపిన విస్తరిగా మార్చుతున్నారు' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సంక్షేమం, అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలిచిన తెలంగాణ ప్రస్తుతం సంక్షోభంలో కూరుకుపోయిందని కేటీఆర్ అన్నారు. అయితే ఈ పరిస్థితులు శాశ్వతం కాదని, 2028 డిసెంబర్‌లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌కు అవకాశం ఇస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# తెలంగాణ నిరుద్యోగులకు శుభవార్త

మొదటిపేజీ తరువాయి

ఈ నోటిఫికేషన్‌లో భాగంగా 49 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టులు, 19 ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి జూన్ 18 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఎఇఇ పోస్టులకు జూలై 13 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండగా, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టులకు జూలై 15 వరకు గడువు కల్పించారు. అభ్యర్థులు అధికారిక నోటిఫికేషన్‌లో పేర్కొన్న అర్హతలు, వయోపరిమితి, ఇతర నిబంధనలను పరిశీలించి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. నియామక ప్రక్రియలో భాగంగా రాత పరీక్షలను ఆగస్టు 10 నుంచి 17 వరకు నిర్వహించనున్నారు. పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన అభ్యర్థులను తుది ఎంపికకు పరిగణలోకి తీసుకుంటారు. పూర్తి వివరాల కోసం అభ్యర్థులు కమిషన్ అధికారిక నోటిఫికేషన్‌ను పరిశీలించాలని సూచిస్తున్నారు.

# తెలంగాణ ఆద్యులు జయశంకర్ విగ్రహానికి పూలమాలవేసి కొబ్బరికాయలు కొట్టి తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన బేరి రామచంద్ర యాదవ్

**శేర్లింగంపల్లి మన మహతి న్యూస్ జూన్ 2**
హైదరాబాద్... తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఆద్యులు జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలవేసి కొబ్బరికాయలు కొట్టి తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేసిన తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ బృందం. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం తెలంగాణ మొత్తం ప్రజలు జాతీయ జెండా ఎగురవేసి సంతోషం పంచుకున్నారు. బేరి రామచంద్ర యాదవ్ మిత్ర బృందం జయశంకర్ ప్రాంగణం రైల్వే స్టేషన్ లింగంపల్లి దగ్గరలో జెండా ఆవిష్కరణ చేసి జయశంకర్ విగ్రహానికి పూలమాలవేసి జయశంకర్ ఆశయాలను సాధిస్తామని, జై తెలంగాణ, జై తెలంగాణ నినాదాలతో పాల్గొని ఉత్సవం జరుపుకున్నారు. ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్, బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ పాల్గొని ప్రసంగించడం జరిగింది. సోనియాగాంధీ దయవల్ల తెలంగాణ తొలి దశ.. మలిదశ ఉద్యమానంతరం మనం తెలంగాణ సాధించుకోవడం జరిగిందన్నారు. తెలంగాణ అభివృద్ధి చెందటానికి ప్రభుత్వాలు కృషి చేయాలని, అదే విధంగా విద్య ఉద్యోగం, వైద్యం ఉచితంగా కేజీ టు పీజీ అని కెసిఆర్ నినాదం, ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత విద్య ఉచిత వైద్యం సామాజిక ఆర్థిక న్యాయం చేకూర్చాలని సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలని సభాముఖంగా విన్నవించడం జరిగింది. కామారెడ్డి డిక్లరేషన్ బీసీలకు 42 శాతం, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు.



ఆర్కే సాయన్న ముదిరాజ్ తెలంగాణ ప్రజలకు ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేస్తూ తన సందేశంలో తెలంగాణ పేదరికంలో మగ్గిన రాష్ట్రమని నిజాం నుండి బ్రిటిష్ వాళ్ళు, వచ్చిన నాయకులు న్యాయం చేయలేదన్నారు. పేదరికం పోలేదు ఇప్పుడు కూడా ఉద్యమకారులకు న్యాయం చేయాలన్నారు. పేదలకు ఆర్థిక సాంఘిక సామాజిక తెలంగాణ న్యాయం పొందే వరకు పోరాటం చేస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం మీరు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలన్నారు. తదనంతరం శేరిలింగంపల్లిలో సీనియర్ సిటిజన్స్ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పురస్కరించుకుని జెండా ఎగురవేసి సమావేశం ఏర్పాటు చేసుకొని సాంస్కృతిక, మిగతా కార్యక్రమాలు నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో జరిగిన ప్రోగ్రాంలో పాల్గొని బేరి రామచంద్ర యాదవ్ ప్రసంగిస్తూ సీనియర్ సిటిజన్ లు అందరూ ఐకమత్యంతో కలిసి మెలిసి ఉండాలన్నారు. ఈ ఆఖరి జీవితంలో సంతోషంగా జీవించాలని కోరుతూ ఏదైనా సమస్య వచ్చిన మేము కూడా మానవత్వం దృక్పథంతో మీకు సహాయకారిగా ఉంటామని తెలిపారు. బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ తన సందేశంలో ఆఖరి ఘడియల్లో ఉన్న వృద్ధులు తమ యొక్క సంఘాలు ఏర్పాటు చేసుకొని ముఖ్యంగా శేరిలింగంపల్లిలో హైటెక్ సిటీ దగ్గర ఉన్నందున పట్టణ కల్చర్ లో కొన్ని విధాల మనకు పిల్లల సహా కారం లభించకపోవడం, మిగతా ఎవరైనా సహకరించకపోవచ్చు ప్రభుత్వ సహకారం తీసుకొని మిగతా మిత్రుల సీనియర్ సిటిజన్స్ సహాయ సహకారాలతో అందరు కలిసి మెలిసి బ్రతకాలని దేహంలోని 168 అవయవములను కదలికలు చేస్తూ వ్యాయామం నడక చేస్తూ ఆనందంగా సంతోషంగా జీవించాలన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న వారిలో బేరి రామచంద్ర యాదవ్ తో పాటు ఆర్కే సాయన్న ముదిరాజ్, యువజన సంఘం అధ్యక్షులు అందేల కుమార్ యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ హరికృష్ణ చారి మల్లికార్జున్ శర్మ, గోవింద్ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సాయిలు, బాల్రాజ్, గోవింద్, బ్యాండ్ రమేష్, మేదరి మహేంద్ర సంఘం కిరణ్, నాయి బ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి ముచ్చర్ల రవీందర్, కోశాధికారి బీరకోట శేఖర్, మంగలి పరశురాం, మంగలి నరేష్, ముదిరాజ్ సంఘం శేర్లింగంపల్లి మనోజ్ ముదిరాజ్ , కృష్ణ గౌడ్,పెద్దలు యువజన నాయకులు అందరు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

# గీతంలో వేసవి క్రీడా శిబిరం ప్రారంభంఉత్సాహంగా పాల్గొంటున్న అధ్యాపకులు, సిబ్బంది పిల్లలు క్యాంపస్ లైఫ్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో నిర్వహణ.

**సంగారెడ్డి, జూన్ 02,మన మహతి న్యూస్ :**
ఉద్యోగుల సంపూర్ణ అభివృద్ధి, శ్రేయస్సు పట్ల తన నిబద్ధతలో భాగంగా, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని క్యాంపస్ లైఫ్ డైరెక్టరేట్, అధ్యాపకులు, సిబ్బంది పిల్లల కోసం వేసవి క్రీడా శిబిరాన్ని ప్రారంభించింది. వేసవి సెలవులలో వారికి క్రమబద్ధమైన క్రీడా శిక్షణను అందించడమే లక్ష్యంగా దీనిని ఆరు నుంచి 15 సంవత్సరాల వయస్సు గల పిల్లల కోసం రూపొందించారు.

ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన క్యాంపస్ కోచ్ ల మార్గదర్శనంలో టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, ఫుట్ బాల్, క్రికెట్ లో శిక్షణను అందిస్తున్నారు. క్రమం తప్పని శిక్షణా తరగతుల ద్వారా, ఇందులో పాల్గొనేవారు జట్టు స్ఫూర్తి, క్రమశిక్షణ, పట్టుదల, క్రీడాస్ఫూర్తి వంటి విలువలను అలవరచుకుంటూ, ప్రాథమిక క్రీడా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశాన్ని పొందుతారు. శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం ద్వారా యువ మనస్సులను తీర్చిదిద్దడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయి. చిన్న వయస్సులోనే పిల్లలకు క్రీడలను పరిచయం చేయడం ద్వారా, గీతం హైదరాబాద్ ప్రాథమిక స్థాయిలో ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించడానికి, క్రమశిక్షణను అలవర్చడానికి ప్రయత్నిస్తోంది.



క్యాంపస్ లైఫ్ డైరెక్టరేట్ నేతృత్వంలోని ఈ చొరవ, చైతన్యవంతమైన, సమ్మిళిత క్యాంపస్ పర్యావరణ వ్యవస్థను సృష్టించడంపై గీతం యొక్క నిరంతర దృష్టిని ప్రతిబింబిస్తుంది. ఉద్యోగులకు, వారి కుటుంబాలకు అర్థవంతమైన భాగస్వామ్య అవకాశాలను కల్పించడం ద్వారా 'గొప్ప ప్రదేశంలో తాము పనిచేస్తున్నాం' అనే సంస్కృతిని పెంపొందించాలనే సంస్థ యొక్క విస్తృత మానవ వనరుల దార్శనికతకు అనుగుణంగా దీనిని రూపొందించారు. ఈ కార్యక్రమం గురించి క్యాంపస్ లైఫ్ డైరెక్టరేట్ అధికారులు మాట్లాడుతూ, ఈ శిబిరం కేవలం క్రీడా శిక్షణకు మాత్రమే పరిమితం కాదని, ఇది చిరస్మరణీయ అనుభవాలకు వేదికగా నిలవడం, చురుకైన జీవనశైలిని ప్రోత్సహించడం, గీతం కుటుంబాల మధ్య సామూహిక భావవను బలోపేతం చేయడం వంటి వాటికి



సంబంధించినదని వివరించారు.
తరగతి గదులు, కార్యాలయాలకు అతీతంగా అభ్యసనం, అభివృద్ధి విస్తరించి, వ్యక్తులు, కుటుంబాల సంపూర్ణ ఎదుగుదలకు, శ్రేయస్సుకు దోహదపడతాయన్న గీతం హైదరాబాద్ నమ్మకాన్ని ఈ వేసవి క్రీడా శిబిరం మరింత బలపరుస్తోంది.

# తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రెండోవ డివిజన్ గుండ్ల సింగారం లో జెండా ఆవిష్కరించడం జరిగింది

- కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్ రవి నాయక్, మాజీ ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ గణిపాక విజయ్ కుమార్, ఎస్టీ సెల్ అధ్యక్షులు రాజు నాయక్.

**హనుమకొండ జిల్లా జూన్ 2 న్యూస్**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రెండోవ డివిజన్ గుండ్ల సింగారం లో జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్ లావుడియా రవి నాయక్, ఏనుమాముల మార్కెట్ మాజీ డైరెక్టర్ గణిపాక విజయ్ కుమార్, రెండోవ



డివిజన్ ఎస్టీ సెల్ అధ్యక్షులు లావుడియా రాజు నాయక్,మరియు యూత్ అధ్యక్షుడు గాదె శివ కుమార్, సీనియర్ నాయకులు సయ్యద్ ఖలీల్ ఎండి ఖలీల్ , గాదె మొగిలి, మాదాసి కళ్యాణ్ ,జన్ను కృష్ణ, గాదె క్రాంతి ,కందికొండ రవి.యూత్ ప్రశాంత్ , అభిలాష్ ,బిక్షపతి, లకావత్ బాబురావు, లకావత్ బాలు, రవి మహిళా



నాయకురాలు భూక్య కవిత, లావణ్య మరియు శరత్ ఎస్.కె పశ మొదలైన వారు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జెండా ఎగరవేసిన మాజీ కార్పొరేటర్ లావుడియా రవి నాయక్ ఎలుమాముల మార్కెట్ మాజీ డైరెక్టర్ గణిపాక విజయకుమార్ లావుడియా రాజు నాయక్ మరియు బి ఆర్ ఎస్ ముఖ్య నాయకులు.

# వైభవోపేతంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.

స్థానిక ముస్తఫా నగర్ శ్రీ చైతన్య పాఠశాల నందు వైభవోపేతంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపల్ శ్రీదేవి గారు తెలంగాణ తల్లికి దీపం వెలిగించి కొబ్బరికాయ కొట్టి పూలను సమర్పించి పూజ చేశారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఎగురవేసి,జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ శ్రీదేవి గారు మాట్లాడుతూ ఎందరో వీరుల త్యాగఫలం తెలంగాణ రాష్ట్ర సాధన అని, తెలంగాణ అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతూ ఉన్నదని, మన వనరులను మనం సక్రమంగా వినియోగించుకుంటున్నామని,విద్యా ఉద్యోగాధి రంగాలలో ఎంతో అభివృద్ధి చెందుతున్నామని క్రమశిక్షణ మంచి నైపుణ్యాలు సాధించాలని దాని ద్వారా తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందాలని, సమిష్టి కృషి అవసరమని, తెలంగాణ ప్రజలందరూ ఎటువంటి భేదభావాలు లేకుండా




సమైక్యతతో అభివృద్ధి పదం వైపు నడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని గురించి తెలుసుకున్న పాఠశాల డైరెక్టర్ శ్రీవిద్య గారు చైర్మన్ మల్లంపాటి శ్రీధర్ గారు డీ.జీ.ఎం .చేతన్ మాధుర్ గారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కోఆర్డినేటర్ కృష్ణారావు గారు డీన్ జయ బాబు గారు ప్రైమరీ ఇంచార్జ్ వినీత గారు ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ తన్వీర్ గారు వారితోపాటు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

## ఐటీడీఏ ఎటునాగారం ఆధ్వర్యంలో గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ రంగాలలో ఉచిత భోజన వసతి తో శిక్షణ కల్పించబడును.

**హనుమకొండ జిల్లా జూన్ 2 న్యూస్**
కోర్సులు యొక్క వివరాలు.

1. వేర్ హౌస్ సూపర్వైజర్,
   ఇంటర్మీడియట్ అర్హత
2. వేర్ హౌస్ అసోసియేట్
   పదవ తరగతి పాస్
3. డొమెస్టిక్ నాన్ వాయిస్
   ఇంటర్మీడియట్
4. జూనియర్ సాఫ్ట్వేర్
   డెవలపర్, డిగ్రీ అర్హత కలిగి ఉండాలి
5. డేటా ఎంట్రీ ఆపరేటర్,
   పదవ తరగతి పాస్ అయి ఉండాలి.

పైన తెలుపబడిన కోర్సులు యూత్ ట్రైనింగ్ సెంటర్ వరంగల్ నందు ప్రారంభం అగుచున్నవి.కావున ఆసక్తిగల గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు తమ యొక్క దరఖాస్తులను అంబేద్కర్ భవన ఎదురుగా డిస్టిక్ ట్రైబల్ డెవలప్మెంట్ ఆఫీసర్ హనుమకొండ మరియు వరంగల్ ఆఫీసు నందు తమ యొక్క జిరాక్స్ పత్రాలతో దరఖాస్తు చేసుకోగలరు. కావున ఈ యొక్క అవకాశాన్ని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోగలరు. శిక్షణానంతరం వివిధ ప్రముఖ ప్రైవేటు కంపెనీల నందు ఉపాధి అవకాశాలు కల్పించబడును. మరియు సర్టిఫికెట్ ఇవ్వబడును. ఇతర వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9652369090, 8919550711. ఏ నారాయణ్ రెడ్డి వరంగల్ డిస్ట్రిక్ట్ ట్రైబల్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఆధ్వర్యంలో

## పోలీస్ వ్యవస్థ పై అవగాహన లేని రాజకీయ నాయకులు

**తెలంగాణ శ్రీనివాస్ నాయక్**

**వరంగల్ జిల్లా జూన్ 2 న్యూస్**
యావత్ భారతదేశంతో పాటు, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో కొంతమంది రాజకీయ నాయకుల వ్యవహార శైలి చూస్తే చదువు కాదు కదా కనీసం సంస్కారం లేకుండా ముఖ్యంగా పోలీస్ వ్యవస్థపై అవగాహన లేకుండా వ్యవహరిస్తూ మూర్ఖులకు మద్దతిస్తూ ప్రవర్తిస్తున్నారని సామాజిక జాతీయ భావం గల ఉద్యమ నేత, తెలంగాణ దగాపడ్డ ఉద్యమకారుడు తెలంగాణ శ్రీనివాస్ నాయక్ విచారం వ్యక్తం చేశారు నిమ్న వర్గాలైన సుమారు 35 మంది సర్కిల్ ఇన్స్పెక్టర్ సర్వీస్ను పరిగణలోకి తీసుకొని ఏసిపి లు గా ప్రభుత్వం ప్రమోషన్లు కల్పిస్తే... వారికి పోస్టింగ్ ఇవ్వకుండా నిర్లక్ష్యపు వైఖరితో తిరిగి నిమ్న వర్గాలైన శాసనసభ్యుల దగ్గర ఖాళీ



లెటర్ ప్యాడ్ పంపించాలని అగ్రవర్ణ నాయకుడు ఒత్తిడి చేస్తూ వారికి నచ్చిన వ్యక్తికి పట్టణాలలో మెరుగైన ప్రాంతంలో పోస్టింగులు ఇప్పించే ప్రయత్నంలో ఉన్నారని, నిమ్న వర్గాల వారికి లూప్ లైన్ ( ఏజెన్సీ) ప్రాంతాలలో పోస్టింగ్లు ఇచ్చే అవకాశం ఉందని ఆరోపించారు... ఇది రాజ్యాంగ విరుద్ధం అయినప్పటికీ టచ్అబుల్, అన్ టచ్ బుల్ ల వ్యవహరిస్తూ నిమ్న వర్గ పోలీసు అధికారులతో ఆటలాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు... పోలీసులు అంటే "ట్రాఫిక్ సిగ్నల్" లాంటి వారు అని, వారు తలుచుకుంటే అడుగు బయటకు వెయ్యలేరు... వేసిన బ్రతికి బట్ట కట్టలేరు... ప్రతి ఉద్యమంలో ముఖ్యంగా తెలంగాణ సాధనలో పోలీసు వారి పాత్ర అమోఘం, అద్భుతం అన్నారు తక్షణమే ప్రమోషన్లు పొందిన నిమ్నవర్గ ఏసీపి లు (ఇన్ఛా) లుగా పట్టణాలలో పోస్టింగులు ఇవ్వాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో హోమ్ గార్డ్ నుండి డీజీపీ వరకు అలాగే వార్డు మెంబర్ నుండి ముఖ్యమంత్రి వరకు అలాగే కేంద్ర హోం మంత్రివర్యుల వరకు మా శైలిలో బహిరంగంగా విన్నవిస్తామని తెలంగాణ శ్రీనివాస్ నాయక్ అన్నారు

## కలెక్టర్ ఆదేశాలతో ఏపూర్ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లపై ఈఈ రాజు పాండ్య విచారణ

**గూడూరు ప్రతినిధి, జూన్ 02:**





గూడూరు మండలంలోని ఏపూర్ గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణంలో అవకతవకలు జరిగాయని, పెండింగ్ బిల్లులు విడుదల కాకపోవడంతో లబ్ధిదారులు ఇటీవల జిల్లా కలెక్టర్ డాక్టర్ స్నేహ శబరిష్‌ను గ్రీవెన్స్ డే సందర్భంగా కలిసి ఫిర్యాదు చేశారు.
ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా కలెక్టర్, రోడ్లు మరియు భవనాల శాఖ (ఆర్‌డబి) కార్యనిర్వాహక ఇంజనీర్ (ఈఈ) రాజు పాండ్యను విచారణ చేపట్టి, అర్హులైన లబ్ధిదారులకు పెండింగ్ బిల్లులు సకాలంలో విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఆర్‌డబి ఈఈ రాజు పాండ్య, డీఈఈ శ్రీకాంత్‌తో కలిసి ఏపూర్ గ్రామంలో పర్యటించి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణంలో చోటుచేసుకున్న అవకతవకలపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు, పెండింగ్ బిల్లుల అంశాలపై వివరాలు సేకరించారు.
ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారులు బానోత్ రామన్న నాయక్, భానోత్ చందా, భూక్యా బిక్కు, ధారావత్ బక్ష, భానోత్ శంకర్, వాంకుడోత్ వద్య, ధారావత్ లచ్చు, మాన్‌సింగ్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు.

**సంగారెడ్డి, జూన్ 2,మన మహతి న్యూస్ :**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్నిపురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు.వేడుకల సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సోనియా గాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్ష అయిన ప్రత్యేక రాష్ట్రాన్ని సాకారం చేసిందన్నారు. తెలంగాణ ఉద్యమ అమరవీరుల



త్యాగాలను స్మరించుకుంటూ, వారి సేవలను ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు.
అలాగే ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం
అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, ప్రజా సంక్షేమం మరియు రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనంత్ కిషన్ తోపాజీ, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు జార్జ్, మున్సిపల్ చైర్‌పర్సన్ వనితా సంతోష్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, నాయకులు కూన సంతోష్, మహేష్ ముదిరాజ్, కౌన్సిలర్లు సంగీత మహేష్, రమేష్, వంశీ, రవి నాయక్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్నిపురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలంగాణ అభివృద్ధికి తమ కట్టుబాటునుపునరుద్ఘాటిస్త,రాష్ట్ర సాధన అనేచారిత్రాత్మక విజయాన్నిస్మరించుకున్నారు.

# ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు.

**•సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి దామోదర రాజనర్సింహ.**

**సంగారెడ్డి, జూన్ 2, మన మహతి న్యూస్ :**
తెలంగాణ రాష్ట్రం నేడు అన్ని రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలుస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.
తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు మంగళవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దామోదర రాజనర్సింహ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, జిల్లాలో సాధించిన ప్రగతిని వివరిస్తూ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలను మంత్రి



దామోదర రాజనర్సింహ, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ఘనంగా సన్మానించి వారి త్యాగాలను స్మరించుకున్నారు.తెలంగా రాష్ట్ర సాధన కోసం అమరవీరులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని, వారి ఆశయాల సాధనే వారికి నిజమైన నివాళి అని పేర్కొన్నారు.విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంత్రి ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను సందర్శించి, ఆయా శాఖల కార్యక్రమాలు, సేవలపై వివరాలు తెలుసుకున్నారు.
అనంతరం నలుగురు దృష్టిలోపం కలిగిన విద్యార్థులకు



ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. 768 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల కింద రూ.69.19 కోట్ల విలువైన చెక్కులను అందజేశారు. అలాగే ట్రాన్స్‌జెండర్‌లకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు.
పీఎం శ్రీ పాఠశాలల్లో నిర్వహించిన వేసవి శిబిరాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రధానోపాధ్యాయులను సన్మానించారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు

**మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా.**
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ముడుమాలలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఉదయం 8 గంటల నుండి 9 గంటల 30నిమిషాల వరకు జరిగిన వేడుకలలో పాఠశాల ప్రదానోపాధ్యాయులు దండు శేఖర్ జాతీయ పతాక ఆవిష్కరణ చేసి తెలంగాణ అమరవీరులకు నివాళులు అర్పించి వారి త్యాగాలను కొనియాడారు..
ఈ సందర్భంగా విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించే సౌకర్యాల గురించి వివరించి ఈ విద్యా సంవత్సరం నుండి ప్రారంభమవుతున్న ప్రీ ప్రైమరీ పాఠశాలలో ఎల్ కేజీ ౘ యూకేజీ తరగతులు



ప్రారంభమవుతున్న సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చూసుకోవాలని పేర్కొన్నడం జరిగింది.అధేవిధంగా ప్రీ ప్రైమరీ పాఠశాలలో పనిచేయుటకు కాంట్రాక్ట్ పద్ధతిన ఒక టీచర్ మరియు ఆయా పోస్టులకు అర్హత గల వారు ధరఖాస్తు చేసుకోవాలని తెలియజేయడం జరిగింది..
ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భారతి,రవికుమార్, జ్యోతి, సర్పంచ్ కె బాల్ రాజ్,ఉప సర్పంచ్ జి రంగమ్మ,వార్డు మెంబర్స్,తాయప్ప గౌడ్,కాద్రు అంజనేయులు,చెన్నయ్య గౌడ్,పి వెంకటేష్,రాజకీయ పార్టీల నాయకులు దండు రాఘవేంద్ర,కాద్రు తమ్మప్ప,వెంకటేష్, వై క్రిష్ణయ్య,మారెప్ప,రామప్ప,హన్మంతు,మహదేవ్ అంగన్‌వాడీ టీచర్లు సునీత,కవిత,వెంకటేశ్వరమ్మ,దౌలత్ బీ,సర్వీస్ పర్సన్స్ సోఫి,శివమ్మ,ఆశ కార్యకర్తలు,విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు

## జిల్లా విద్యాశాఖ అధికారిని మర్యాదపూర్వకంగా కలిసిన పీఆర్టీయూటీఎస్ నాయకులు

**జూన్ 2,మన మహతి న్యూస్ పాల్వంచ**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వాసంతిను పీఆర్టీయూటీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పూనెం నరసయ్య, అసోసియేట్ అధ్యక్షులు భూక్యా భాస్కరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు దశం బాబు, బానోతు నాగులు, రాష్ట్ర కార్యదర్శి మోహన్, దుమ్ముగూడెం మండల కార్యదర్శి మల్లికార్జునరావు, సుజాతనగర్ అధ్యక్షులు శ్రీరాములు, కొత్తగూడెం అధ్యక్షులు భాస్కర్ పాల్గొన్నారు.
నూతన బాధ్యతలు స్వీకరించిన వాసంతికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లాలో విద్యా ప్రమాణాల మెరుగుదల, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే అంశాలపై చర్చించారు. విద్యా రంగ అభివృద్ధికి పీఆర్టీయూటీఎస్ తరఫున పూర్తి సహకారం అందిస్తామని నాయకులు తెలిపారు.
వాసంతి నాయకత్వంలో జిల్లాలో విద్యా రంగం మరింత అభివృద్ధి సాధించాలని వారు ఆకాంక్షించారు.

## ఏజెన్సీ ప్రాంత ప్రజలకు వరంగా సమ్మక్క--సారక్క గ్యాస్ ఏజెన్సీ సేవలు

**ఆళ్ల పల్లి జూన్ 2:మన మహతి న్యూస్**




ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన గ్యాస్ సేవలు అందిస్తూ సమ్మక్క--సారక్క గ్యాస్ ఏజెన్సీ విశేష ఆదరణ పొందుతోంది. గుండాల మండలం ఆళ్లపల్లిలో నిర్వహిస్తున్న ఈ గ్యాస్ ఏజెన్సీ ద్వారా దూర ప్రాంత గిరిజన గ్రామాల ప్రజలకు సకాలంలో గ్యాస్ సిలిండర్ల సరఫరా జరుగుతోంది.
వినియోగదారులకు సులభంగా అందుబాటులో ఉండే విధంగా సేవలు అందించడంతో పాటు, బుకింగ్ చేసిన సిలిండర్లను వేగంగా పంపిణీ చేస్తూ ఏజెన్సీ మంచి పేరు సంపాదించుకుంది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో రవాణా సమస్యలు ఉన్నప్పటికీ, వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా సేవలు అందించడం అభినందనీయమని స్థానికులు పేర్కొంటున్నారు. మార్కోడు, ఆళ్లపల్లి, వెంకటాపురం, రాయపాడు, చింతకుంట ఉలవనూరు, రేగళ్ల పెద్ద తండ వివిధ ప్రాంతాలలో
సురక్షితమైన గ్యాస్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ, వినియోగదారుల సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా సమ్మక్క--సారక్క గ్యాస్ ఏజెన్సీ కృషి చేస్తోందని ప్రజలు ప్రశంసిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ ఈ సంస్థ ఆదర్శంగా నిలుస్తోంది.

## మియాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ

**శేరిలింగంపల్లి మన మహతి న్యూస్ జూన్ 2**



### ఎమ్మెల్యే గాంధీ , సీనియర్ నాయకులతో కలిసి పాల్గొన్న మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. సందర్భంగా గౌరవ పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ జాతీయ జెండాను ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో గౌరవ మాజీ కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ పాల్గొని, సహచర మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, యువ నాయకులతో కలిసి తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరికి కూడా సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కృపానిధి కృష్ణవేణి హై స్కూల్‌లో అడ్మిషన్లు ప్రారంభం.




**సంగారెడ్డి,జూన్ 02,మన మహతి న్యూస్ :**
నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ సంగారెడ్డిలోని కృపానిధి కృష్ణవేణి హై స్కూల్ 2026–27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లను ప్రారంభించింది. పాఠశాల డైరెక్టర్ ౘ ప్రిన్సిపాల్ కృపానిధి పరిడా ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆధునిక విద్యా విధానాలు, క్రమశిక్షణ, విలువల ఆధారిత విద్య అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.పాఠశాలలో అకాడమిక్ ఎక్సలెన్స్, హోలిస్టిక్ డెవలప్‌మెంట్, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత,ఆవిష్కరణాత్మక ఆలోచనలను పెంపొందించేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
“ఇన్స్పైర్ -- ఇన్నోవాతే -- లీడ్ “ అనే నినాదంతో ముందుకు సాగుతున్న ఈ విద్యాసంస్థలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ఆధునిక బోధనా విధానాలు, ఉత్తమ విద్యా వాతావరణం అందుబాటులో ఉన్నాయని వివరించారు.అడ్మిషన్ల కోసం ఆసక్తి గల తల్లిదండ్రులు పాఠశాలను నేరుగా సంప్రదించాలని నిర్వాహకులు కోరారు. పాఠశాల సంగారెడ్డి ప్రధాన రహదారిపై, ఐబీ సిగ్నల్ సమీపంలో ఉన్నట్లు తెలిపారు.

## మక్తల్ కోర్టులో జాతీయ పతాకావిష్కరణ

**మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట. జిల్లా.**



మక్తల్ మున్సిపల్ కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జడ్జి కె. అవినాష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్వరాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల బలిదానాలను ఆయన స్మరించుకున్నారు. ఈ వేడుకల్లో స్థానిక న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నివేదిక

●తెలంగాణ రాష్ట్రం 2014 జూన్ 2న ఏర్పడిన సందర్భంగా ప్రతి సంవత్సరం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు.





**వరంగల్ జిల్లా జూన్ 2 న్యూస్**

ఈ సందర్భంగా సంగెం మండలం, పెద్ద తండ గ్రామ పంచాయతీలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ వినోద రవీందర్ నాయక్ గుగులోత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శి యాదగిరి మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంస్కృతి, సంప్రదాయాల గురించి ప్రసంగాలు నిర్వహించారు. విద్యార్థులు దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ ఆకట్టుకున్నారు.

ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని నాయకులు పిలుపునిచ్చారు.

# వెంకట్రాపురంలో ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఉపాధి హామీ కూలీల ఆరోపణలు

## ఫీల్డ్ అసిస్టెంట్ భర్త పెత్తనం

అనంతగిరి మండల పరిధిలోని వెంకట్రాపురం గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ శివరాణి ఉపాధి హామీ పనులు అన్ని గ్రూపులకు సమానంగా కల్పించడం లేదని గ్రామస్తులు మంగళవారం ఆరోపించారు. ఈ విషయాన్ని వారు గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు.గ్రామంలో పని కల్పనలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోందని, కొన్ని గ్రూపులకు పనులు ఇవ్వకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ భర్త కూడా పనుల విషయాల్లో జోక్యం చేసుకుంటూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆరోపించారు. పలుమార్లు సమస్యను చెప్పినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయంపై కార్యదర్శి నాగలక్ష్మి మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల ఫిర్యాదు అందిందని తెలిపారు. ఇప్పటికే ఎంపీడీవో దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు పేర్కొని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# వసంతాపురంలో జెండాను ఆవిష్కరించిన బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు భూక్య. రామచంద్ర



అనంతగిరి: మండల పరిధిలోని వసంతాపురం గ్రామంలో ఘనంగాతెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవని నిర్వహించారు. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు.. భూక్యరామచంద్ర. మాట్లాడుతూ. మన తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి సాధించిన విజయాలను స్మరించుకునేందుకు గర్వకారణమైన రోజు, అనేక మంది అమరవీరుల త్యాగాలు, విద్యార్థుల పోరాటాలు, ప్రజల ఆకాంక్షల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందనీ వారన్నారు వారి త్యాగాలను ఈ సందర్భంగా మనం కృతజ్ఞతతో స్మరించుకోవాలి.

తెలంగాణ ఏర్పడిన తరువాత వ్యవసాయం, సాగునీరు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు వంటి అనేక రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగింది. ఈ అభివృద్ధి ఫలాలు ప్రతి పేద కుటుంబానికి, రైతుకు, యువతకు చేరేలా మనమందరం కృషి చేయాలి. వలస నాయకుల పాలనలో ప్రస్తుత తెలంగాణ వివక్షకు గురవుతుందనీ అబద్ధపు ప్రచారాలతో కాంగ్రెస్ గద్దెనెక్కి తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని సాధించిన రాష్ట్రాన్ని బాగు చేయాలని లక్ష్యంతో కేసీఆర్ కృషి చేశారని తెలియజేశారు

ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు భూక్యా రాంచంద్రు, పులిగండ్ల శ్రీనివాసరావు, మొండితోక రాములు, భూక్యా శ్రీను,మల్సుర్, రాంకోటి, చందారావు, సత్యం బాబు,ముత్యాలు, హరీష్, రాజారామ్, సైదులు, శివాజీ, అనిల్,ఉదయ్, పవన్ మంగయ్య

# రవాణా శాఖ కార్యాలయంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**మన మహతి న్యూస్ భద్రాచలం**

13వ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఐటిడిఏ ప్రాంగణంలోని రవాణా శాఖ భద్రాచలం యూనిట్ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, తెలంగాణ ఉద్యమ చరిత్ర, రాష్ట్ర ఆవిర్భావ ప్రాముఖ్యతను వివరించారు.

ఆయన మాట్లాడుతూ, ఆరు దశాబ్దాల పాటు సాగిన తెలంగాణ ఆత్మగౌరవ పోరాటంలో ఎందరో ఉద్యమకారులు తమ ప్రాణాలను అర్పించారని, వారి త్యాగాల ఫలితంగానే 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. ముఖ్యంగా మలి దశ తెలంగాణ ఉద్యమంలో.. తన పాత్ర ను గుర్తు చేసుకుంటూ.. కొత్తగూడెం తాలూకా టి ఎన్ జీ ఓల అధ్యక్షులు గా, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గా మరియు తెలంగాణ పొలిటికల్ జే ఏ సి కొత్తగూడెం రెవిన్యూ డివిజన్ కన్వీనర్ గా.. ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నట్లు తెలియజేసారు.

తెలంగాణ మలిదశ ఉద్యమంలో శ్రీకాంతాచారి, యాదయ్య, పోలీస్ కిష్టయ్య, యాదయ్య,వేణుగోపాల చారి , యాది రెడ్డి,కవితతో పాటు సుమారు 1200 మంది అమరుల త్యాగాలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, టీజీవో ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. కామేశ్వరరావు, కానిస్టేబుల్ శివయ్య, నాగేశ్వరరావు, భీముడు, మొబైల్ కోర్టు సిబ్బంది, ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఐటీడీఏ భద్రాచలం డిప్యూటీ డైరెక్టర్‌ను చందన ను మర్యాద పూర్వకంగా కలిసిన పీఆర్టీయూటీఎస్ నాయకులు



**భద్రాచలం, జూన్ 2 మన మహతి న్యూస్**

ఐటీడీఏ భద్రాచలం నూతన డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన చందన ను పీఆర్టీయూటీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పూనెం నరసయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కారంపూడి దశమ్ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు నాగులు పాల్గొని పుష్పగుచ్ఛం అందజేశారు.

సమావేశంలో గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధి, పాఠశాలల అభివృద్ధి, ఉపాధ్యాయుల సమస్యలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే అంశాలపై చర్చించారు. ఐటీడీఏ పరిధిలో విద్యా కార్యక్రమాల బలోపేతానికి సంఘం తరఫున పూర్తి సహకారం అందిస్తామని నాయకులు తెలిపారు.

చందన అధికారంలో గిరిజన ప్రాంత విద్యారంగం మరింత అభివృద్ధి సాధించాలని వారు ఆకాంక్షించారు.

# బద్వేల్ మున్సిపాల్ ఇంచార్జ్ కమిషనర్ హరినాథ్ ని కలిసిన పసుపులేటి ఫౌండేషన్ ట్రస్ట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పసుపులేటి వినోద్

**ఉమ్మడి కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గం జూన్ 2**



బద్వేల్ మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ బాలం హరినాథ్ ని మర్యాదపూర్వకముగా కలిశారు మంగళవారం నాడు మున్సిపల్ కమిషనర్ ఛాంబర్ నందు కమిషనర్ హరినాథ్ కి పూల మాలలు వేసి సన్మానం చేశారు ఈ కార్యక్రమంలో దాసరి సాయి కుమార్ పసుపులేటి జెమలయ్య పీవీ ప్రసాద్ పగడాల సంజీవ్ రాయుడు ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# జూన్ 4న సీఎం ఏరియల్ సర్వే: మంత్రి.వాకిటి శ్రీహరి



**మన.మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా.**

మక్తల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 4న సీఎం రేవంత్ రెడ్డి సాగునీటి ప్రాజెక్టులపై ఏరియల్ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. మక్తల్-- నారాయణపేట --కొడంగల్ ఎత్తిపోతల పథకంతో పాటు జంగంరెడ్డిపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటనను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# మక్తల్ లో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతారణ దినోత్సవ. వేడుకలు.



**మన మహతి. న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా.**

మక్తల్ పట్టణంలోని నారాయణపేట క్రాస్ రోడ్ వద్ద రాష్ట్ర క్రీడ,పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక,మత్స్య, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

జాతీయ జెండాను ఎగురవేసి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. చౌరస్తా వద్ద తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులు అర్పించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ....

తెలంగాణ రాష్ట్ర సాధన లో 1200 మంది పైగా అమరులయ్యారన్నారు.

తెలంగాణ పునరనిర్మాణంలో మనమందరం పునరశీకితం కావాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన వారి ఆశయ సాధనకు కృషి చేయాలని మంత్రి వెల్లడించారు. మక్తల్ అభివృద్ధి కి అన్ని రాజకీయ పార్టీ లు కలిసి రావాలని పిలుపునిచ్చారు. మక్తల్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం మానుకోవాలని ప్రతిపక్షాలకు హితవు పలికారు. ఏదైనా

కూల్చడం సులువు కానీ నిర్మించడం చాలా కష్టమని విపక్షాలకు చురకలంటించారు. పార్టీలకతీతంగా తెలంగాణఆవిర్భావ వేడుకల్లో పాల్గొనడం సంతోషదాయకమన్నారు. నారాయణపేట చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన మానవహారం లో మంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులను మంత్రి వాకిటి శ్రీహరి గారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తో పాటు మక్తల్ మున్సిపల్ ఛైర్ పర్సన్ వాకిటి మానస హన్మంతు, కౌన్సిలర్ లు, కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# కొత్తగూడెంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కే.అజయ్ కుమార్ బాధ్యతల స్వీకరణ

**కొత్తగూడెం, జూన్ 2 మన మహతి న్యూస్**




సాధారణ బదిలీలలో భాగంగా కే. అజయ్ కుమార్ మంగళవారం కొత్తగూడెం మూడవ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో బెల్లంపల్లి ప్రాంతంలో విధులు నిర్వహించి, బదిలీపై కొత్తగూడెంకు వచ్చారు.

కాగా, కొత్తగూడెం మొదటి మరియు రెండవ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులకు అనిల్ కుమార్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.

# ఘనంగా తెలంగాణ ఆవిర్బవ దినోత్సవ కార్యక్రమం.

నడిగూడెం: మండల పరిధిలోని తెల్లబల్లి గ్రామం ప్రాథమిక సహకార సంఘశీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్బవ దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంగం చైర్మన్ జెండా ఎగరవేసి శుభాకాంక్షలు తెలిపారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నో యేండ్లు శ్రమించి ఎంతో మంది ప్రాణత్యాగల ఫలితమే తెలంగాణ రాష్ట్రం.నేడు మన రాష్టం అభివృద్ధి బాటలో సాగుతుంది. ఎంతో సంపద వనరులు కలిగిన తెలంగాణ. రాష్టం ఏర్పాటు కాకముందు దోపిడీకి గురి అయ్యింది. ఇప్పుడు ఆ సంపద రాష్ట్ర అభివృద్ధి కి సహాయం పడుతుంది. ఇతర దేశాలకు దీటుగా తెలంగాణ రాష్టం అభివృద్ధి చెందే విదంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సరోజినీ రంగయ్య,ఉప సర్పంచ్ వీరబాబు,చైర్మన్ బుర్రా

Printed, Published & Owned by Boda prakash s/o krishna h.no 3-2 satyanarayana puram Edulapuram khammam rural Telanagana 507003 , Printed at Maddineni Nageshwara Rao , H.NO 1-17 18 , Svn Colony, Edulapuram, khammam rural Telanagana 507003, EDITOR : Boda prakash PH : 9000005078 & 9133935333 , RNI. NO TGTEL/26/A0372. EMAIL: manamahati@gmail.com